

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



ప్రజావాణిలో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్

జనగామ రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చే అర్జీలపై నిర్లక్ష్యం వహించకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి లో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, బెన్షాలోమ్‌లతో కలిసి ప్రజల వద్ద నుంచి 55 అర్జీలను స్వీకరించారు. ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని మండలాల తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలపై ఎలాంటి అలసత్వం వహించరాదని, సమస్యలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కారించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీవోలు గోపిరామ్, వెంకన్న పాల్గొన్నారు.

యూరియాను బ్లాక్ మార్కెటింగ్ చేస్తే చర్యలు

యూరియాను అక్రమ నిల్వలు చేసినా, బ్లాక్ మార్కెటింగ్ చేసిన చటరీత్యా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. యూరియా విక్రయ కేంద్రాలకు అవసరమైన ఈ-పాస్ యంత్రాలను కలెక్టరేట్‌లో పీఏసీఎస్ డీలర్లకు పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సౌలభ్యం కొరకు యూరియా సరఫరా పెరుగుతున్న నేపథ్యంలో అదనపు యూరియా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రైతు వేదికల వద్ద అదనపు యూరియా సెల్ కౌంటర్లను ఏర్పాటు చేశామని దీంతో రైతులకు ఎలాంటి నిరీక్షణ లేకుండా తమ గ్రామంలోనే యూరియాను కొనుగోలు చేయవచ్చాన్నారు. రైతులు తప్పనిసారిగా తమ ఆధార్‌కార్డు, పంట నమోదు పత్రాలు తీసుకువచ్చి యూరియాను పొందాలన్నారు.

ఫిజియోథెరపిస్టుల సేవలను వినియోగించుకోవాలి

ప్రజలు తప్పనిసారిగా ఫిజియోథెరపిస్టుల సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ అన్నారు. వరల్డ్ ఫిజియోథెరపీ డేను జనగామ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహించగా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనేక రకాల వ్యాధుల నుంచి త్వరగా కోలుకోవడంలో ఫిజియోథెరపి ఎంతో ఉపయోగకరమన్నారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో మల్లిఖార్జునరావు, డాక్టర్ మధుకర్ యాదవ్ పాల్గొన్నారు.

10న ఓటరు తుది జాబితా

జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల తుది జాబితా 10న వెలువరించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, జెడ్పీ సీఈవో మాధురిషాతో కలిసి గుర్తింపు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాల్లో గ్రామ పంచాయతీల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించడం జరిగిందన్నారు. ముసాయిదా, ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. అభ్యంతరాలను పరిశీలించి మార్పులు, చేర్పులు 10న తుది జాబితాను వెలువరిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు భృంగి భాస్కర్, ఏగుర్ల విజయ్ భాస్కర్, రావెల రవి, పడిపడిగ చంద్రశేఖర్, తేజావత్ అజ య్ కుమార్, సోమ్మయ్య, జోగు ప్రకాశ్ పాల్గొన్నారు.



అప్పుతిప్పలు పెడుతున్నారు..!

- జిల్లాలో జోరుగా మిత్తి దందా
- రూ.10 నుంచి రూ.15 చొప్పున వసూలు
- పేదల అవసరాలే ఆసరాగా వ్యాపారం
- సకాలంలో ఇవ్వకపోతే బెదిరింపులు
- ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్లపై సంతకాలు
- ముందస్తుగానే ప్రాపర్టీ జీపీఏలు
- కొరవడిన అధికారులు, పోలీసుల పర్యవేక్షణ
- అడ్డగోలు వడ్డీలపై పేదలు లబోదిబో...

జనగామ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పేదలు, చిరు వ్యాపారుల అవసరం వారికి కాసులు కురిపిస్తోంది. చిరు వ్యాపారులు, వ్యసనాలకు అలవాటు పడ్డ యువత, పేదల అవసరాన్ని ఆసరాగా చేసుకున్న వారు అధిక వడ్డీలతో నడ్డివిరుస్తున్నారు. జనగామ జిల్లాకేంద్రంతో పాటు జిల్లా వ్యాప్తంగా వడ్డీ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా పేదలను అధిక వడ్డీలతో వడ్డీ వ్యాపారులు పీల్చి పిప్పి చేస్తున్నారు. తాము చెప్పిందే వడ్డీ.. రాసుకున్నదే అగ్రిమెంట్.. అన్న చందంగా వీరి దందా సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా గడిచిన రెండేళ్లలో వడ్డీ వ్యాపారులు, ఫైనాన్స్ సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఈ తరహా వడ్డీ వ్యాపారాలు, అక్రమ డైలీ ఫైనాన్స్ సంస్థలపై ప్రభుత్వ అధికారులు, పోలీసుల పర్యవేక్షణ లేక పోవడంతో వారి దందా యథేచ్ఛగా సాగుతోంది.

వడ్డీ వ్యాపారుల ధన దాహం...

జనగామ పట్టణంతో పాటు జిల్లా వ్యాప్తంగా వడ్డీ వ్యాపారులు, ఫైనాన్స్ నిర్వాహకుల ధన దాహానికి అంతేలేకుండా పోతోంది. రోజువారీ, నెల వారీగా ఫైనాన్స్ దీర్ఘకాలిక అప్పుల పేరుతో పెద్దమొత్తంలో వడ్డీని గుంజుతున్నారు. ముఖ్యంగా జిల్లాకేంద్రంలో వడ్డీ వ్యాపారం దందా పెద్ద మొత్తంలో సాగుతోంది. జిల్లాకేంద్రంలో చిరు వ్యాపారులు, ఆటోడ్రైవర్లు, పండ్లు, కూరగాయల దుకాణాల నిర్వాహకులు పెద్ద సంఖ్యలో ఉంటారు. వీరి వ్యాపారానికి అవసరమైన డబ్బులను వడ్డీ వ్యాపారులు, డైలీ ఫైనాన్స్ నిర్వహించే వారి వద్ద తీసుకుంటారు. డైలీ ఫైనాన్స్‌లో రూ.లక్ష అప్పుగా తీసుకుంటే రూ.85వేలు మాత్రమే చేతికి ఇస్తారు. రూ.15వేలను వడ్డీ కింద ముందే తీసుకుంటారు. కానీ, రూ.లక్ష మొత్తాన్ని రోజుకు రూ.1000 చొప్పున వంద రోజులపాటు వసూలు చేసుకుంటారు. ఈ లెక్కన వడ్డీ నెలకు 5 శాతం వసూలు చేస్తున్నారు. అత్యవసరం ఉండి వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లిన వారికి చుక్కలే కనిపిస్తున్నాయి. ఒక రోజుకు చేబదులు కింద తీసుకుంటే ఏకంగా రూ.లక్షకు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు తీసుకుంటున్న వారు కూడా లేకపోలేదు. రెండు, మూడు నెలల గడువుతో అప్పు తీసుకున్నా నెలకు రూ.లక్షకు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు గుంజుతున్నారు. చిరు వ్యాపారులతో పాటు బెట్టింగ్, మట్కా, ఆన్‌లైన్ రమ్మీ, పేకాట, గంజాయి, మద్యం వంటి వ్యసనాలకు అలవాటు పడ్డ యువతను వడ్డీ వ్యాపారులు పట్టి పీడిస్తున్నారు. కార్లు, బైకులు తనఖా పెట్టుకొని అప్పులు ఇస్తున్నారు. దీంతో యువత మరింత జులాయిలుగా, వ్యసనపరులుగా మారుతున్నారు.

శ్రుతిమించుతున్న ఆగడాలు

వడ్డీ వ్యాపారులు, డైలీ ఫైనాన్స్ (మిగతా 8లో)





పారదర్శకంగా జీపీవోల కౌన్సెలింగ్

జనగామ రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పరిపాలన అధికారులు (జీపీవో)ల కేటాయింపు పారదర్శకంగా కౌన్సెలింగ్ ద్వారా జరిగిందని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూభారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జీపీవోల నియామకానికి శ్రీకారం చుట్టి రాత పరీక్ష నిర్వహించి అర్హులైన వారికి 5న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారని తెలిపారు జీపీవోల కేటాయింపు క్లస్టర్ వారీగా 129 మంది జీపీవోలు నేటి నుంచి విధుల్లోకి హాజరవుతారని తెలిపారు.

ఇంటి నుంచే ఎంప్లాయిూమెంట్ కార్డు నమోదు

- ప్రత్యేక వెబ్‌సైట్ తీసుకొచ్చిన ప్రభుత్వం

వివరాలు: 7లో

ధిక్కార స్ఫూర్తి.. ఉద్యమ దీప్తి..

- నిత్య చైతన్యపతాక ప్రజాకవి కాళోజి
- నేడు 111వ జయంతి
- పలు కార్యక్రమాలకు ఏర్పాట్లు

7





సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఉన్నతాధికారులు

కదంతొక్కిన లంబాడీలు

- ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే పిటీషన్‌పై ఆగ్రహం
- సుప్రీంలో పిటీషన్ వేసిన వెంకట్రావు, బాబురావుపై గరంగరం
- జిల్లాలో పలుచోట్ల లంబాడీల ఆందోళనలు
- నేడు వరంగల్‌లో జరిగే శాంతి ర్యాలీ జయప్రదం చేయాలని పిలుపు

వివరాలు 8లో...



స్టేషన్‌ఘన్‌పూర్ ర్యాలీలో మాట్లాడుతున్న ఎల్ఆర్‌పీ జేఏసీ నాయకులు

మేడారం అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

- భక్తులకు అసౌకర్యం కలగకుండా పనులు చేపట్టాలి
- త్వరలోనే మేడారాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తా
- సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ములుగు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో జరిగే మేడారం మహాజాతర నాటికి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో మేడారం, బాసర ఆలయాల అభివృద్ధిపై ఆయన సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మేడారం, బాసర ఆలయాల మాస్టర్ ప్లాన్‌ను అధికారులు సీఎంకు వివరించారు. మేడారం అభివృద్ధికి సంబంధించిన డిజైన్లను పరిశీలించిన ముఖ్యమంత్రి 100 రోజుల్లో ఎ పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పూర్తిగా సహజ సిద్ధమైన రాతి కట్టడాలతో నిర్మాణాలను చేపట్టాలన్నారు. భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా ఎంట్రీ, ఎగ్జిట్, పార్కింగ్‌తో పాటు వసతులు ఉండాలన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని జంపన్నవాగులో నీరు నిల్వ ఉండేలా ఏరియాల వారీగా చెక్‌డ్యాంల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. త్వరలోనే మేడారాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానన్నారు. అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలయ అభివృద్ధి విషయంలో స్థానిక ప్రజల సెంటిమెంట్‌ను గౌరవించాలన్నారు. నిపుణుల, పూజారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి భారీ గణపతి



రఘునాథపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మం డల కేంద్రంలోని బ్యాంకు స్ట్రీట్‌లో నెలకొల్పిన భారీ వినాయక విగ్రహాన్ని 13వ రోజు(సోమవారం) నిమ జ్జనం చేశారు. 34ఏళ్ల నుంచి పెద్ద వినాయక విగ్రహా న్ని ఏర్పాటు చేస్తున్నారు. లడ్డూను లక్షల్లో వేలంలో భక్తులు దక్కించుకుంటుండగా, ఈసారి విగ్రహ దా త కోళ్ల సాయికుమార్ గౌడ్‌కు కమిటీ నిర్వహకులు అందజేశారు. కార్యక్రమంలో తాజా మాజీ జడ్పీటీ సీ బొల్లం అజయ్‌మణికంఠ, కోళ్ల వెంకటయ్య, కోళ్ల రవిగౌడ్, బొల్లం రంజిత్, కొన్నె సతీష్, రాజీవ్, గందె ప్రదీప్, సంతోష్, రఫీ, జహంగీర్, హరినాథ్, ఆకుల మహేష్, కందుల అనిల్ పాల్గొన్నారు.

సోమేశ్వరాలయ సంప్రోక్షణ



ఆలయంలో సంప్రోక్షణ పూజలు చేస్తున్న అర్చకులు

పాలకుర్తి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని సంపూర్ణ చంద్రగ్రహణ అనంతరం సోమవారం అర్చకులు గణపతి పూజ, పుణ్యాహవాచనం నిర్వహించి ప్రధాన ఆలయం సంప్రోక్షణ చేసిన తర్వాత భక్తులకు యథాతథంగా దర్శనాలు, అర్జిత సేవలు కల్పించినట్లు ఆలయ ఈవో మోహన్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు దేవగిరి లక్ష్మన్న, డీ.ఈవీ.ఆర్ శర్మ, అనిల్‌కుమార్, నాగరాజు, వెంకటయ్య ఉన్నారు.

కలెక్టరేట్‌ను ముట్టడించిన దివ్యాంగులు

పెన్షన్‌ను పెంచాలని డిమాండ్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దివ్యాంగులు

జనగామ రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వికలాంగుల సమస్యలను పరిష్కరించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు గడ్డం సోమురాజ్, ఎమార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పైసా రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వికలాంగులు వీహెచ్‌పీఎస్, ఎమార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం జనగామ ఆర్టీసీ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ముట్టడించారు. అనంతరం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం వికలాంగులకు రూ.6,000 వృద్ధులు, వితంతువులకు రూ.4,000 పింఛన్ ఇవ్వాలని, వైన్స్ షాపులో టెండర్లు లేకుండా వికలాంగులకు 4 శాతం రిజర్వేషన్ కల్పించాలని, వికలాంగుల పిల్లలకు కార్పొరేట్ పాఠశాలలో 4 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గద్దల కిషోర్, బోట్ల మహేశ్, బిర్రు నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కష్టాలు



శివునిపల్లిలో ఫర్టిలైజర్ దుకాణం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో రైతులకు యూరియా తిప్పల తప్పడం లేదు. స్టేషన్‌ఘన్‌పూర్ మునిసిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలో క్రిష్ణ ఫర్టిలైజర్ దుకాణానికి యూరియా వచ్చిందనే విషయాన్ని తెలుసుకున్న రైతులు దుకాణం వద్దకు చేరుకొని లైన్లలో నిలబడి ఇబ్బందులు పడాల్సి వచ్చింది. రైతులు ఎండలో నిలబడకుండా ఉండేందుకు పోలీసుల సహకారంతో రైతులకు సంబంధించిన ఆధార్‌కార్డులను తీసుకొని వరుసక్రమంలో పెట్టి వాటి ఆధారంగా రైతులను పిలిచి యూరియా బస్తాలను అందించారు. ఆగ్రోస్, హాకా, పీఏసీఎస్ యూరియా విక్రయ కేంద్రాల్లో ఒక్కో యూరియా బస్తాకు రూ.266 నుంచి రూ.280 తీసుకోగా, క్రిష్ణ యజమాని ఒక్కో బస్తాకు రూ.300 తీసుకోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు.



ఎంపికైన విద్యార్థినులతో విద్యాలయం టీచర్లు

రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీలకు విద్యార్థినులు

కాటారం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయానికి చెందిన ముగ్గురు విద్యార్థినులు కళా ఉత్సవ్-2025 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈమేరకు విద్యాలయం ఎస్‌వో చల్ల సునీత తెలిపారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో గ్రూప్ సాంగ్ (వోకల్ మ్యూజిక్) విభాగంలో విద్యాలయానికి చెందిన ఇంటర్ విద్యార్థిని పరిమళ, తొమ్మిదో తరగతి విద్యార్థినులు అలేఖ్య, హరిప్రియ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ఎస్‌వో వెల్లడించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : ఎర్రబెల్లి



చీకటాయపాలెంలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న దయాకర్‌రావు

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తకు అండగా ఉంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. వివిధ కారణాలతో మండలంలోని చీకటాయపాలెం, కంఠాయపాలెం, చింతలపల్లి తదితర గ్రామాల్లో మృతి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలను సోమవారం దయాకర్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళ్లు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తూర్పాటి అంజయ్య, మండల ఎన్నికల ఇంచార్జీ సునీల్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ప్రమోద్ కుమార్, పట్టణ వర్కింగ్ ప్రసిడెంట్ అనుమాండ్ల ప్రదీప్ రెడ్డి, జంపా, లేగల వెంకట రెడ్డి, పయ్యావుల రాంమూర్తి, యర్రం రాజు, ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు బ్యాలెట్ ఓటింగ్‌లో పాల్గొనాలి

సీఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్



మాట్లాడతున్న సీఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

కృష్ణకాలనీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులు సొంతింటి సాధన కోసం బ్యాలెట్ ఓటింగ్‌లో పాల్గొనాలని సీఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సీఐటీయూసీ కార్యాలయంలో సోమవారం జరిగిన సింగరేణి మైన్స్ మీటింగ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 11, 12, తేదీల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో బ్యాలెట్ ఓటింగ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్మికులంతా అధిక సంఖ్యలో పాల్గొనాలని అన్నారు. కార్మికుల సొంతింటి కల నేరవేర్చుకునేందుకు మద్దతుగా ఈ ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు. సమావేశంలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంపెనట రాజయ్య, నేతలు దేవేందర్, శేఖర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలవాలి

ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

దంతాలపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలిచి గ్రామీణ విద్యార్థులకు సేవలందించాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో రూ.7లక్షలతో దివ్యాంగుల కోసం భవిత భవన శంకుస్థాపన పనులకు భూమి పూజా చేశారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాలలో ఇటీవల జిల్లా స్థాయి, మండల స్థాయి అవార్డును పొందిన ఉపాధ్యాయులకు ఆయన ఘనంగా సన్మానించి అభినందించారు. మండలంలోని దాట్ల ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి జంపాల కావ్యచే రచించబడిన శ్రీకావ్యం శతకం పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా రాంచంద్రునాయక్ దాట్ల హెచ్‌ఎం కృష్ణయ్యను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులన్నారు. దేశ భవిష్యత్ వారిపైనే ఆధారపడి ఉందన్నారు. విద్యార్థి తరగతి గదిలో క్రమశిక్షణతో మెలిగినప్పుడే బంగారు భవిష్యత్‌కు పునా ది వేస్తాడన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీటవేస్తున్నారన్నారు. అభివృద్ధి పర్వడంలో పార్టీలకు అతీతంగా గ్రామాల్లో కార్యకర్తలు పని చేయాలన్నారు. డోర్నకల్ నియోజకవర్గంను కంటికి రెప్పలా కాపాడుకునేందుకు కృషి చేస్తున్నాన్నారు. రైతులకు సకాలంలో సరిపడా ఎరువులను అందిస్తామన్నారు. రైతులు ఇబ్బందులకు గురికావద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీదేవి, ఎంపీవో అప్సరపాషా, పంచాయతీ కార్యదర్శి ఏశబోయిన వెంకన్న, హెచ్‌ఎం వేణుమాధవ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బట్టునాయక్, తాజామాజీ సర్పంచ్ కొమ్మినేని రవీందర్, నాయకులు పొన్నోటి బాలాజీ, యువ యూత్ నాయకుడు యువరాజ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

సమీక్ష సమావేశంలో ములుగు కలెక్టర్ దివాకర



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, హాస్టళ్ల విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ టి.ఎస్.దివాకర అన్నారు. అధికారులు హాస్టళ్లు, పాఠశాలలను తరచూ తనిఖీ చేయాలని ఆదేశించారు. తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ సోమవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వార్డెన్ నుంచి డీఈవో వరకు అందరూ విధులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతోపాటు హాస్టళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు విద్యనందిస్తున్న తీరును పరిశీలించాలని అన్నారు. తనిఖీల్లో సిబ్బంది పనితీరు బాగుగా లేకుంటే చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సి.హెచ్.మహేందర్‌జీ, ఐటీడీఏ ఏపీవో వసంతరావు, డీఈవో సిద్ధార్థరెడ్డి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి లక్ష్మణ్‌నాయక్, బీసీవెల్ఫేర్ అధికారి సర్దార్‌సింగ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు వినతిపత్రం అందచేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

మంత్రి అడ్లూరిని కలిసిన ఎమ్మెల్యే

పాలకుర్తి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను హైదరాబాద్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో తండాలు, హరిజన కాలనీల్లో రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తేగా, స్పందించి రోడ్ల మరమ్మతులకు రూ.21 కోట్లు నిధులు మంజూరి చేసేందుకు హామీ ఇచ్చారని తెలిపారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

రెండో ఏఎన్‌ఎంల ధర్నా

జనగామ రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో పని చేస్తున్న రెండో ఏఎన్‌ఎంల సమస్యలను పరిష్కరించాలని ఏఎన్‌ఎంల సంఘం రాష్ట్ర నాయకురాలు కొండ్ర లత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట రెండో ఏఎన్‌ఎంలు ధర్నా చేపట్టి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. లత మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖలో గత 18 ఏళ్లుగా ఏఎన్‌ఎంలుగా కాంట్రాక్ట్ పద్ధతిన తాము పని చేయడం జరుగుతుందన్నారు. ఎన్‌హెచ్‌ఎమ్‌లో వివిధ క్యాడర్‌లో పని చేస్తున్న ఉద్యోగులందరిని ఇతర రాష్ట్రంలో రెగ్యులర్ చేస్తున్నట్లు రాష్ట్రంలో కూడా 10 ఏళ్లుగా పని చేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలన్నారు. ఏఎన్‌ఏంలను మొబైల్ అప్లికేషన్ ఆన్‌లైన్‌లో వర్క్ ద్వారా పని ఒత్తిడిని తగ్గించా లని, పెండింగ్‌లో ఉన్న ఏరియర్స్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బేబీ రాణి, రాధిక, కవిత, లక్ష్మీ, వనజ, రేఖ తదితరులు పాల్గొన్నారు.

8వ పే కమిషన్‌ను ఏర్పాటు చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన 8వ పే కమిషన్‌ను కేంద్రం వెంటనే ఏర్పాటు చేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్‌కు చెందిన రైల్వే మజ్దూర్ యూనియన్ కాజీపేట బ్రాంచ్ సెక్రటరీ ఇల్లెందుల రాజేందర్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ వద్ద కార్మికులతో కలిసి ఆయన మాట్లాడారు. 8వ పే కమిషన్‌ను అమలు చేయాలనే డిమాండ్‌తో 19న అన్ని రైల్వే కార్యాలయాల ఎదుట చేపట్టే ధర్నా విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ భిక్షపతి, శేఖర్, దేవయ్య, నర్సింహస్వామి, కరుణాచారి, భాస్కర్, శివ, సత్యనారాయణ, జాఫర్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కలవరపెడుతున్న పులి సంచారం

● రామప్ప వానగుట్టపై గాండ్రింపులు విన్నామంటున్న గ్రామస్థులు

వెంకటాపూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో పెద్దపులి సంచరిస్తోందనే వార్త స్థానికులను మూడు రోజులుగా కలవరపెడుతోంది.పాకాల కొత్తగూడ నుంచి పత్తిపల్లి, సింగరకుంటపల్లి మీదుగా పాపయ్యపల్లికి చేరుకున్న పులి రామప్ప సరస్సులో ఈత కొట్టినట్లు తొలుత ఫారెస్టు అధికారులు భావించారు. ఈదిశగా విచారణ జరిపి పులి పాదముద్రలు కూడా సేకరించారు. ఆ తర్వాత పులిజాడ విషయంపై ఫారెస్ట్ అధికారులు మౌనంగా ఉంటున్నారు. పులి సంచారం వార్త స్థానిక ప్రజలను కంటికి కనుకులేకుండా చేస్తోంది.

తాజాగా రామప్పలోని వానగుట్టపై పులి గాండ్రింపులు వినబడినట్లు చెంచుగూడెం గ్రామస్థులు తెలుపుతున్నారు. దీంతో వానగుట్ట చుట్టూ ఉన్న గ్రామ ప్రజలు భయంతో గజగజ వణుకుతున్నారు. పశువుల కాపర్లు సైతం భయాందోళనకు గురవుతున్నారు. అయినా ఫారెస్ట్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఫారెస్టు అధికారులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి పులి ఆచూకీని గుర్తించి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

వాట్సాప్ ద్వారా విద్యుత్ సమస్యల పరిష్కారం

ములుగు టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు వాట్సాప్ చాట్‌బాట్ ద్వారా టీజీఎన్పీడీసీఎల్ సేవలను అందుబాటులోకి తెచ్చిందని ములుగు డివిజనల్ ఇంజనీర్ నాగేశ్వర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాట్సాప్‌లో 7901628346 నంబర్‌కు 'హాయ్' అని మేసేజ్ పంపగానే 'వెల్కమ్ టు టీజీఎన్పీడీసీఎల్ కాల్ సెంటర్' అని సందేశం అందుతుందని తెలిపారు. వెంటనే రిజిస్టర్ కంప్లైంట్, ట్రాక్ కంప్లైంట్, చాట్ విత్ ఏజెంట్ వంటి ఆప్షన్లు ఎంచుకొని తమ సమస్యలను పేర్కొనాలని వివరించారు. లేదా నేరుగా ఏజెంట్‌తో చాట్ చేయొచ్చని తెలిపారు. ఆయా ఫిర్యాదులు సంబంధిత అధికారికి చేరి తద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. వినియోగదారులు ఎప్పుడైనా కంప్లైంట్ ఐడీ ద్వారా తన సమస్య పురోగతిని ట్రాక్ చేసుకోవచ్చని, సమస్య పరిష్కారం అయిన తర్వాత ఐవీఆర్ఎస్ కాల్ వస్తుందని తెలిపారు. వినియోగదారులు సంతృప్తి చెందనట్లయితే కంప్లైంట్‌ను మళ్లీ రీ ఓపెన్ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సౌకర్యం ద్వారా వినియోగదారులకు మరింత వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందే అవకాశం ఉందని తెలిపారు.

ఉపాధ్యాయుడి గుర్తింపుపై విచారణ చేపట్టాలి

కలెక్టర్‌కు ఫిర్యాదు

జనగామ కల్చరల్, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడి గుర్తింపుపై విచారణ చేపట్టాలని విభావిని విద్యా సమితి కార్యదర్శి కటంగూరు సత్యనారాయణరెడ్డి కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇనుగాల దేవేందర్‌రెడ్డి అనే వ్యక్తి వికాసభారతి విద్యానికేతన్ ఎడ్యుకేషనల్ సొసైటీలో ఇనుగాల సంజీవరెడ్డి కుమారుడిగా చెప్పుకోగా.. జనగామ జిల్లా పరిధిలోని టీచర్ ఐడి నం.2122598 ప్రకారం ఇనుగాల వెంకట్‌రెడ్డి కుమారుడిగా చూపి 23.03.1998 నుంచి ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్నాడన్నారు. ప్రస్తుతం జఫర్‌గఢ్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోషల్ టీచర్‌గా పని చేస్తున్నాడన్నారు. ఒకే వ్యక్తి ఇద్దరు తండ్రుల పేర్లతో పనిచేస్తూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నాడని ఆరోపించారు. ఇతను ఎవరి కుమారుడు అనే విషయమై సమగ్ర విచారణ జరిపించాలని కలెక్టర్‌ను కోరాడు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా

ఏటూరునాగారం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రం వైజంక్షన్‌లోని బీఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా నాయకుడు భూక్య జంపన్న ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ ఈ జాబ్ మేళాకు సమారు 200 మంది నిరుద్యోగ యువత హాజరయ్యారని, ఇందులో 80 మందిని వివిధ కంపెనీలు ఎంపిక చేసుకున్నాయని వివరించారు. మిగిలిన 120 మందికి సంబంధించిన వివరాలను వివిధ కంపెనీలకు రెఫర్ చేసినట్టుపేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు కాకులమర్రి ప్రదీప్‌రావు, మండల అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, పట్టణ అధ్యక్షుడు ఎమ్డీ. ఖాజా పాషా తదితరులు పాల్గొన్నారు.

జీవో 99 రోస్టర్ పాయింట్‌తో మాలలకు అన్యాయం

జేఎంఎం జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్



మహబూబాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న జాతీయ మాలమహానాడు నేతలు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవో 99 రోస్టర్ పాయింట్ విధానం వల్ల ఎస్సీ గ్రూప్-3లోని మాల అనుబంధ 26 కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని జాతీయ మాలమహానాడు(జేఎంఎం) జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్ అన్నారు. జీవో 99ను రద్దు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ముట్టడి పిలుపులో భాగంగా మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అశోద భాస్కర్ మాట్లాడుతూ.. జస్టిస్ షమీమ్ అక్తర్ రిపోర్టు ప్రకారం తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టి ఎస్సీ-1 గ్రూపుకు 15 కులాలు కేటాయించి ఒక్క శాతం రిజర్వేషన్, గ్రూప్-2కు 18 కులాలు కేటాయించి(మాదిగలకు 9 శాతం), గ్రూప్-3కు 26 కులాలు కేటాయించి(మాలలకు 5 శాతం) రిజర్వేషన్ కేటాయించారని చెప్పారు. అశాస్త్రీయమైన వర్గీకరణతో మాలలు తీవ్ర నష్టపోతున్నారని తెలిపారు. 14 ఏప్రిల్ 2025న రాష్ట్ర ప్రభుత్వం జీవో 99 ద్వారా రోస్టర్ విధానాన్ని తీసుకువచ్చారని ద్వారా మాలలకు, అనుబంధ కులాలకు విద్య, ఉద్యోగాల్లో అన్యాయం జరుగుతుందని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కందుకూరి వెంకటాద్రి, కారం ప్రశాంత్, బాణాల సంజీవ, దర్గయ్య, ఉప్పలయ్య, వెంకన్న, సోమయ్య, వీరన్న, ఎల్లయ్య, సమ్మయ్య, రాజు పాల్గొన్నారు.

కాళోజీ అవార్డుకు ఎంపికైన రమాదేవికి సన్మానం



రమాదేవిని సన్మానిస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాళోజీ పురస్కారానికి ఎంపికైన శివునిపల్లి పట్టణ నివాసి, ప్రముఖ రచయిత్రి, కవయిత్రి, కార్టూనిస్ట్ నెల్లుట్ల రమాదేవిని సోమవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో రమాదేవి సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకోనున్నారు. ఇప్పటికే పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం, సినారే పురస్కారం అందుకున్న ఆమె కాళోజీ పురస్కారానికి ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ కొలిపాక సతీష్, మేకల మల్లేశం, ఎం.శ్రీనివాస్, ఎస్.రాములు, షేక్ జానీ, జె.శ్రీకాంత్, పి.మధు తదితరులు పాల్గొన్నారు.

రమాదేవికి పురస్కారం అభినందనీయం: పల్లా

జనగామ కల్చరల్(ఆంధ్రజ్యోతి): ప్రజాకవి కాళోజీ సాహితీ పురస్కారానికి ఎంపికైన నెల్లుట్ల రమాదేవికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన రమాదేవి సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో విశేష కృషి చేసినందుకు కాళోజీ నారాయణరావు అవార్డులకు ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు. వ్యక్తిగత స్థాయిలోనూ పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే ఆమె సేవలను కొనియాడారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాములుగౌడ్

పెద్దవంగర, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకొని సత్తాచాటాలని బీజేపీ మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు రంగు రాములుగౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు ఉప్పరగూడెం, ఎల్‌బీతండా, చిట్యాల, బొమ్మకల్ గ్రామాల్లో మండల అధ్యక్షుడు కట్కోజు భాస్కరాచారి అధ్యక్షతన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యకర్తలే బీజేపీకి బలమన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా రాష్ట్రంలో ప్రజల సమస్యలపై బీజేపీ పోరాటం చేస్తుందని, ప్రజలకు పూర్తి స్థాయిలో న్యాయం చేసే పార్టీగా బీజేపీకి మంచి గుర్తింపును కార్యకర్తలు తీసుకరావాలన్నారు. మోసపూరిత పాలన కొనసాగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సార్యధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీల అమలులో గారెడీతో ప్రజలను మభ్యపెడుతోందని ఆరోపించారు. గ్రామాల్లో బుత్‌స్థాయి నుంచి పటిష్ఠం చేస్తూ బీజేపీ అభివృద్ధికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. గ్రామాల్లో యువత మోదీ నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొయ్యడి ముఖేష్, సందీప్, సుధాకర్, శంకర్, కిరణ్, బాలు, దాసు, శ్రీకాంత్, సాయి, చరణ్, గణేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రంగు రాములుగౌడ్

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7530	5300
మక్కలు	2201	1521
కందులు	5142	3022
పెసళ్లు	4650	3022
పల్లికాయ (సూక)	6020	3500
పల్లికాయ (పచ్చిది)	4400	2400
పసుపు (కాడి)	11369	7889
పసుపు (గోల)	10116	8996
తేజ మిర్చి	12000	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	15000	12000
యూఎస్341ఏసీ	14800	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ప్రభుత్వం తక్షణమే పెన్షన్లు పెంచాలి

కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకుల ధర్నా

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట నిలుపుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. అంతకు ముందు ఏకశిల పార్కు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ మాదిగ మాట్లాడుతూ.. ప్రభుత్వం తక్షణమే దివ్యాంగుల పెన్షన్ రూ.4వేల నుంచి రూ.6వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికుల పెన్షన్ రూ.4 వేలకు పెంచాలని, ఇప్పటికే దరఖాస్తు చేసుకొని ఉన్న అర్హులైన వారికి నూతన పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ సత్యశారదకు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర, జిల్లా నాయకులు వంగూరి ఆనందరావు, వేల్పుల సూరన్న, కె.ప్రణయ్ దీప్, బాబు, రాజు యాదవ్, మాసాని గోపాల్, ధర్మన్న, గంగారపు మల్లన్న, చింతం సిద్ధు, చంద్రశేఖర్, బిర్రు హైమావతి, గంపుల మాలతి, దివ్యాంగులు, పెన్షన్ దారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నా భార్య నన్ను చంపాలని చూస్తోంది..

మీడియా ముందు ఓ భర్త ఆవేదన



బాధితుడు బానోతు మహేష్

పర్వతగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తన భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుని, తనను చంపాలని చూస్తోందని ఓ భర్త ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వారి నుంచి తనకు రక్షణ కల్పించాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన వరంగల్ జిల్లాలో సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి... పర్వతగిరి మండలంలోని సోమారం గ్రామ శివారు జగ్గు తండాకు చెందిన బానోతు మహేశ్ అలియాస్ బాలుకు అదే తండాకు చెందిన యువతితో 2009లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. 11 సంవత్సరాల కిందట ఆమె తన సమీప బంధువైన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది.

ఈ విషయం మహేశ్‌కు తెలియడంతో భార్య ప్లేట్ మార్చింది. సదరు వ్యక్తి తనను వేధిస్తున్నాడని భర్తను నమ్మించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం లోక్ అదాలత్‌లో భర్త మహేశ్‌కు తెలియకుండా కేసు వాపస్ తీసుకుంది. ఆ తర్వాత విషయం తెలుసుకున్న మహేశ్ భార్య తీరును గ్రహించాడు. తనను మభ్యపెట్టి వివాహేతర సంబంధం సాగిస్తోందని తెలుసుకున్నాడు. అప్పటి నుంచి ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు పెద్దమనుషులకు, పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కౌన్సిలింగ్ నిర్వహించారు. అయినా భార్య తీరు మారలేదు. ఈ క్రమంలో ఆమెతో, ఆమె ప్రియుడితో తనకు ముప్పు ఉందని అనుమానించాడు. ఇటీవల వినాయక చవితి పండుగ సందర్భంగా తనను చంపేందుకు కుట్ర చేశారని మహేష్ ఈ నెల 3న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు విచారణ చేస్తున్న క్రమంలో సోమవారం మహేశ్ మీడియా ముందుకు వచ్చి భార్య తీరును వెల్లడించాడు. తనను కాపాడాలని మీడియా ద్వారా పోలీసులను కోరుతున్నట్టు తెలిపాడు.

నిత్య చైతన్యపతాక ప్రజాకవి కాళోజి

నేడు 111వ జయంతి


ధిక్కార స్ఫూర్తి.. ఉద్యమ దీప్తి..



హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు చిరునామాగా, 95 ఏళ్ల జీవిత కాలాన్ని ప్రజాఉద్యమాల కోసం వెచ్చించిన మహామనీషి.. 20వ శతాబ్దపు దార్శనికుడు.. నిరంతర ధిక్కార ధ్వని.. సమకాలీన సమాజానికి మార్గదర్శనం చేసే సాహిత్యాన్ని ఏనాడో అందించిన ప్రజాకవి కాళోజీ నారాయణ రావు 111వ జయంతి వేడుకలు మంగళవారం పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నా హృదిన ఇన్ని వేదనలు

అవనిపై జరిగేటి అవతవకలు జూసి.. ఎందుకో నా హృదికి ఇన్ని వేదనలు.. అంటూ సమాజంలోని ఎన్నో వెతలను నా గొడవగా చిత్రీకరించిన మనీషి కాళోజీ. అసమ్మతి, నిరసన, ధిక్కార స్వరం, మానవత్వపు మనుగడకు నిలువెత్తు సంతకం. కాళోజీ ఒక కాలేజీ అన్నది అక్షరసత్యం. అక్షర యోధుడు. ఈ కాలపు వేమన. పౌరహక్కుల సంతకం. మానవతకు జెండా. నిజమైన ప్రజాస్వామ్యవాది. నిత్య చైతన్య మూర్తి. ఉద్యమ జీవి. వీటన్నింటి చిరునామా కాళోజీయే. ఆయన కలం నుంచి జాలువారిన అక్షరాలు తూటాలవలే ప్రతీ తెలుగు వారి హృదయంలో ముద్రితమై ఆలోచనలు కలిగింప చేస్తాయి.



అన్నపురాశులు ఒక చోట..

అన్నపురాసులు ఒక చోట.. ఆకలి మంటలు ఒక చోట.. హంస తూలికలు ఒక చోట.. అంటూ సమాజంలో తరతమ వ్యత్యాసాలను ఎండగడుతూ రాసిన కాళోజీ సాహిత్యమంతా నిత్యచైతన్యమే. వందల సంఖ్యలో ఆయన రాసిన సాహిత్యం అంతా నా గొడవే. ముఖ్యంగా ఒక శతాబ్దకాలపు తెలంగాణ సామాజిక, రాజకీయ చరిత్ర అంతా ఆయన సాహిత్యమే. పలుకుబడుల భాష కావాలని పట్టుబట్టిన కాళన్న జయంతిని తెలుగు మాండలిక భాషా దినోత్సవంగా జరుపుతున్నారు. జరిగినవన్నీ చూస్తూ కూర్చుండ సాక్షీభూతుణ్ని కాను.. సాక్షాత్తు మానవుడినే.. అని గర్వంగా చెప్పిన మానవతామూర్తి. పద్మ విభూషణ్ ప్రజాకవి కాళోజీ జీవితాన్ని మానవీయ సంబంధాన్ని విడదీసి చూడలేం. బతుకు తప్పదు.. బతక్క తప్పదు.. అన్న గొప్ప సందేశం కాళోజీది. అన్యాయాన్నెదిరించిన కాళోజీకి అన్యాయాన్నెదిరించినవాడే ఆరాధ్యుడు.

రమాదేవికి కాళోజీ పురస్కారం

ప్రజాకవి కాళోజీ జయంతి సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే కాళోజీ పురస్కారం ఈ సారి వరంగల్‌కే దక్కింది. జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్‌కు చెందిన నెల్లుట్ల రమాదేవికి అవార్డును ప్రకటించారు. కాళోజీ అవార్డును ఏర్పాటు చేసినప్పటి నుంచి మహిళా కవయిత్రి అవార్డు అందుకోవడం ఇదే మొదటి సారి. అవార్డు కింద ఆమెకు రూ.లక్ష నగదును అందించనున్నారు.

తెలుగు బిడ్డవురోరి..

తెలుగు బిడ్డవురోరి.. తెలుగు మాట్లాడుటకు సంకోచ పడియెదవు సంగతేమిటిరా.. అంటూ మాతృభాష అయిన తెలుగును చిన్నచూపు చూస్తూ పరభాషా వ్యామోహంలో కూరుకుపోయిన వారిని ఆంధ్రంబు రాదంటు సకిలించు ఆంధ్రుడా.. చావవెందుకురా.. అని సూటిగా ప్రశ్నిస్తూ ఏనాడో కవిత్వం రాశాడు.

ఉద్యమశీలి

కాళోజీకి తెలంగాణ అంటే వల్లమాలిన అభిమానం. తొలి తెలంగాణ ఉద్యమంలో స్వయంగా పాల్గొని ప్రత్యేక రాష్ట్రం కోసం నినదించిన ఉద్యమకారుడు. 1969 మే ఒకటో తేదీన వరంగల్‌లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం పేరిట ప్రజా సమితి సదస్సులో కాళోజీ సంధించిన కవితాస్త్రం.. దోపిడీ చేసే ప్రాంతేతరులను దూరందాక తన్ని తరుముతాం.. ప్రాంతం వాడే దోపిడీ చేస్తే ప్రాణంతోనే పాతర వేస్తం.. తెలంగాణ వేరైతే దేశానికి అపత్తా.. అంటూ తెలంగాణ అంశంపై వందలాది కవితాస్త్రాలను కురిపించి ఉద్యమానికి ఆనాడే బాసటగా నిలిచిన కాళోజీ నేటి తెలంగాణ జీవితంలో నిత్యనూతనుడాయన.

నేటి కార్యక్రమాలు

కాళోజీ జయంతిని పురస్కరించుకొని అధికారింగా హనుమకొండ జిల్లా యంత్రాంగం నక్కలగుట్టలోని కాళోజీ విగ్రహానికి జిల్లా కలెక్టర్, అధికారులు, కాళోజీ ఫౌండేషన్ సభ్యులు, కవులు, సాహిత్య ప్రముఖులు ఉదయం 10 గంటలకు పూల మాలలు సమర్పిస్తారు. కాళోజీ ఫౌండేషన్ ద్వారా ప్రతీ ఏటా ప్రదానం చేసే తెలుగు, ఉర్దూ కవుల వివరాలను ఈ సందర్భంగా ప్రకటించనున్నారు. హనుమకొండకు చెందిన కాళోజీ ఫౌండేషన్ కార్యదర్శి వీఆర్ విద్యార్థి, సంయుక్త కార్యదర్శి పొట్లపల్లి శ్రీనివాసరావు హైదరాబాద్‌లోని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయంలో కాళోజీ జయంతి పేరిట ఏర్పాటు చేసిన తెలంగాణ భాషా దినోత్సవంలో పాల్గొంటారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయ సంఘం సహకారంతో నిర్వహించనున్న తెలంగాణ భాషా దినోత్సవంలో నగరానికి చెందిన ప్రముఖ రచయిత, కాళోజీ డాక్యుమెంటరీ సినిమా నిర్మాత, దర్శకుడు, ఇటీవల గద్దర్ జ్యూరీ ఫిల్మ్ వార్డు గ్రహీత ప్రభాకర్ జైనీ విశిష్ట అతిథిగా పాల్గొననున్నారు. అన్ని ప్రభుత్వకార్యాలయాలు, విద్యా సంస్థల్లో కాళోజీ జయంతి వేడుకలు జరగనున్నాయి.





వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ అంబటి నర్సయ్య

తండ్రిని చంపిన తనయుడి అరెస్టు

వివరాలు వెల్లడించిన ఏసీపీ

వర్ధన్నపేట సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలోని గుబ్బెట తండాలో సెపెంబరు 6వ తేదీన తండ్రిని చంపిన తనయుడిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం..

వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలోని సపవట్ సురేశ్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. నిందితుడు సురేశ్‌కు తాళ్లకుంటకు చెందిన మౌనికతో 2019లో వివాహం జరిగి ముగ్గురు సంతానం. కాగా, ఇటీవల కొంత కాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. సపవట్ సురేశ్ మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుండడంతో తరుచూ గొడవలు జరుగుతుండడం, తండ్రి సపవట్ రాజు మధ్యలోకి వెళ్లి గొడవను శాంతింపజేసి కొడుకు సురేశ్‌ను మందలించేవాడు. గొడవలు జరిగి మౌనిక పుట్టింటికి వెళ్లడంతో ఇటీవల పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించి భార్య మౌనికను సురేష్ ఇంటికి తీసుకువచ్చాడు. వివాహేతర సంబంధానికి భార్య మౌనిక, తండ్రి రాజు తరచూ అడ్డువస్తున్నారని, వీరిని అడ్డు తొలగించుకోవాలని ఆలోచన చేసిన సపవట్ సురేశ్ భార్య మౌనికతో మళ్లీ గొడవకు దిగాడు. తండ్రి సప వట్ రాజు (59) మధ్యలోకి వెళ్లి గొడవను సద్దు మనగ చేద్దాం అనుకునే ప్రయత్నంలో కోపోద్రిక్తుడైన సురేశ్ తండ్రి సపవట్ రాజును ఛాతిలో, మొకం పైన పిడుగుద్దులు గుద్ది కింద పడేసి బయటకు వెళ్లి పోయాడు.

తిరిగి మళ్లి సురేశ్ ఇంటికి వచ్చి అక్కడే ఉన్న తండ్రి రాజుపై దాడి చేసి పిల్లలను ఊయ్యాల ఊపడానికి కట్టిన చీరతో రాత్రి 7.30గంటల సమయంలో తండ్రి సపవట్ రాజు మెడకు చుట్టి బిగించి చంపి పారిపోయాడు. సురేశ్ అదే రాత్రి తొర్రూరు బస్టాండ్‌కు వెళ్లిపోయాడు. మళ్లీ అక్కడి నుంచి తిరిగి అదే రాత్రి వర్ధన్నపేట బస్టాండ్‌కు రాగా, వర్ధన్నపేట పోలీసులు పట్టుకొని అరెస్టు చేసినట్లు వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య తెలిపారు. సపవట్ రాజు కుమార్తె మాలోతు స్వప్న ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన వర్ధన్నపేట పోలీసులు వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు ఎన్.సాయిబాబు, ఎం.రాజులను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ అభినందించారు.

చేపా చేపా ఎక్కడున్నావ్?

- జిల్లాలో ప్రారంభంకాని సీడ్ పంపిణీ
- అదునుదాటుతోందని మత్స్యకారుల ఆందోళన
- చేప పిల్లలకు బదుల నగదు పంపిణీ చేయాలని డిమాండ్

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చేపపిల్లల పంపిణీ ఇంకా ప్రారంభం కాలేదు. గత ప్రభుత్వంలో జూలై రెండో వారం నుంచే చేపపిల్లల పంపిణీ కార్యక్రమం మొదలయ్యేది. అలాంటిది సెప్టెంబరు రెండో వారం వచ్చినా ఇంకా వాటి ఊసే లేదు. దీంతో మత్సకారుల్లో ఆందోళన మొదలైంది. చేప పిల్లలను జూలై, ఆగస్టు నెలల్లో చెరువుల్లో వదిలితేదే ఫిబ్రవరి, మార్చి వరకు ఒక్కో చేప కిలో వరకు ఎదుగుతుంది. ఏప్రిల్ నుంచి జలాశయాల్లో నీటినిల్వలు తగ్గుముఖం పడుతాయి. క్రమక్రమంగా చేపలు చనిపోతాయి. అందువల్ల మత్సకారులు ఆలోపే చేపలను విక్రయిస్తారు. అందువల్ల ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు. ఇప్పటికే అదను దాటుతుండడంతో మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు(సొసైటీలు) అనేక చెరువుల్లో చేపపిల్లలను వదిలాయి. దీనికోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేశారు. అందువల్ల ప్రభుత్వం వెంటనే స్పందించి చేప పిల్లలకు బదులు సొసైటీలకు నగదు బదిలీ చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. దీనివల్ల రాబోయే కాలంలో కూడా అదను చూసి చెరువుల్లో చేపపిల్లలను



పోసుకునే అవకాశం ఉంటుందని అంటున్నారు.

కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలి..

జలాశయాల్లో చేపపిల్లల పంపిణీకి గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో కాంట్రాక్టు వ్యవస్థను తీసుకువచ్చింది. అయితే దీనిలో అనేక లోపాలున్నాయని మత్స్యసహకార సంఘాలు ఆరోపిస్తున్నాయి. కాంట్రాక్టర్లు నాసిరకం చేపపిల్లను పంపిణీ చేస్తున్నారని, సైజులో, లెక్కల్లో తేడాలు ఉంటున్నాయని మత్సకారులు ఆరోపిస్తున్నారు. అందువల్ల చేపపిల్లల పంపిణీ సొసైటీలకే అప్పగించాలని కోరుతున్నారు.

జిల్లాలో 702 చెరువులు..

జిల్లాలో 702 చెరువులుండగా నీటి విస్తీర్ణం 12,910 హెకార్లు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. అదేవిధంగా 184 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలుండగా వాటిలో 15,741 మంది సభ్యులు ఉన్నారు. చేపల పెంపకం, విక్రయమే వీరి ప్రధాన వృత్తిగా కొనసాగుతున్నారు.

నగదు బదిలీ చేయాలి..



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నేరుగా పెట్టుబడి సహాయం అందిస్తున్నట్లుగా మత్స్య పారిశ్రామిక సంఘాలకు చేపపిల్లల కొనుగోలు కోసం నేరుగా నగదు అందించాలి. దీంతో సంఘాలు సకాలంలో చేపపిల్లను కొనుగోలు చేసి జలాశయాల్లో వదిలేందుకు అవకాశం ఉంటుంది. ఇలా చేస్తేనే మత్స్యకారులకు ప్రయాజనం చేకూరుతుంది.

\- నీరటి సదానందం, ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి

రెండు ఏజెన్సీలు టెండరు దాఖలు..

ఈ ఏడాది చేపపిల్లలను పంపిణీ చేయడానికి వరంగల్ జిల్లా నుంచి రెండు, హనుమకొండ జిల్లా నుంచి ఒక ఏజెన్సీ టెండరు దాఖలు చేసినట్లు మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. టెండర్ల దాఖలుకు సోమవారం నాటికే చివరి తేదీ అయినప్పటికీ మత్స్యశాఖ ఉన్నతాధికారులు ఈనెల 12 వరకు పొడిగించారు. 12న టెండర్లను తెరిచి ఏ ఏజెన్సీకి చేపల పంపిణీకి అవకాశం దక్కిందనేది ప్రకటిస్తారు. అదే విధంగా ఈనెలాఖరులోగా చేప పిల్లలను పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

రేవంత్ రెడ్డి బోగస్ మాటలతో సీఎం అయ్యాడు

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

పర్వతగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రేవంత్ రెడ్డి బోగస్ మాటలు చెప్పి ప్రజలను మోసం చేసి ముఖ్యమంత్రి అయ్యాడని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. సోమవారం మండలంలోని కల్లెడ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీలో ఇద్దరం కలిసి పనిచేశామని, అప్పటి నుంచే ప్రజలను ఎలా మోసం చేయాలో మాతో చర్చించేవాడని ఆరోపించారు. అటువంటి వ్యక్తి తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుతాడని అనుకోలేదని, కానీ, రేవంత్ రెడ్డికి అదే కలిసొచ్చిందని ఎద్దేవా చేశారు. అధికార పార్టీ నుంచి మన పార్టీలో చేరుతున్నారంటే కాంగ్రెస్ అసమర్థ పాలన అర్థంచేసుకోవాలన్నారు. యూరియా కొరత వచ్చిందంటే ఈ ప్రభుత్వ పాలన రైతులకు తెలుస్తోందన్నారు. కేసీఆర్ హయాంలో రాజుగా బతికిన రైతులు నేడు పస్తుండాల్సి వస్తోందన్నారు. మండలంలోని ప్రతి కార్యకర్తని కలుపుకుని పోయి పార్టీ గెలుపు కోసం పాటుపడాలన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి అవుతారని



కల్లెడలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

ఆశాభావం వ్యక్తంచేశారు. గడగడపకు మన కార్యకర్త తిరిగి ఈ బోగస్ ప్రభుత్వం చేసిన బోగస్ హామీలను గుర్తు చేసి అర్థమయ్యే రీతిలో ప్రచారం చేయాలన్నారు. కష్టపడి పనిచేసిన కార్యకర్తకే గుర్తింపు ఉంటుందన్నారు. త్వరలోనే కమిటీలు వేసి ప్రతీ కార్యకర్తకి శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్లని ఈ ప్రభుత్వం ప్రవేశపెట్టి ఒక మోసపూరిత ధోరణి వ్యవహరిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన బోగస్ 420 హామీల వల్ల ప్రజలు మోసపోయారన్నారు. తెలంగాణ ఒక బ్లాక్ మెయిలర్ చేతిలో పడి నలిగిపోతోందని ఆరోపించారు. ప్రజలు, నిరుద్యోగ విద్యార్థులు ఎన్నికల కోసం వేచి చూస్తున్నారని తెలిపారు. పార్టీ క్యాడర్, యూత్, సోషల్ మీడియా యాక్టివ్‌గా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్ర పాలన పట్ల ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండి వారి ఎత్తులను తిప్పికొట్టాలన్నారు. అనంతరం టీపీసీసీ ఎస్టీ సెల్ తేజావత్ వినీత్ నాయక్ ఆధ్వర్యంలో భారీగా కార్యకర్తలు ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ మోటపోతు మనోజ్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, జిల్లా నాయకుడు చింతపట్ల సోమేశ్వర్ రావు, పరమేశ్వర్ రావు, మాజీ జడ్పీటీసీ లునావత్ పంతులు, మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు, దేవేంద్రచారి, మండల, గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఇంటి నుంచే ఎంప్లాయ్‌మెంట్

కార్డు నమోదు

అంతర్జాలంలో ప్రత్యేక వెబ్‌సైట్ తీసుకొచ్చిన ప్రభుత్వం

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువకులు ఉపాధి కార్యాలయల్లో తమ పేరును నమోదు చేసుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వ ఉద్యోగాల కల్పన లేకపోవడంతో వెనకడుగేస్తున్నారు. దీంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ తగ్గుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నిరుద్యోగులు ఉపా ధి కార్యాలయానికి వెళ్లకుండానే అంత ర్జాలంలో తమ పేరును రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలుగా అవకాశం కల్పించారు. దీంతో ఇంటి వద్ద ఉంటూనే నిరుద్యోగులు ఎంప్లాయ్‌మెం ట్ కార్డు పొందుతున్నారు. రెన్యువల్ గడువులోను మార్పు చేశారు. ఆన్‌లైన్‌లో నమోదు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలపై ఉపాధి కార్యాలయ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఒకసారి అభ్యర్థి నమోదు చేసుకుంటే 54ఏళ్ల వరకు గడువు ఉంటుంది. అభ్యర్థుల వయసు 61నిండినప్పుడు కార్డు కాలం చెల్లుతుంది.


కారణాలు ఇవీ..

- గతంలో ప్రభుత్వ ఉద్యోగం రావాలంటే కచ్చితంగా ఉపాధి కార్యాలయంలో నమోదు తప్పని సరి ఉండేది.
- జిల్లాస్థాయి పోస్టులను అభ్యర్థుల విద్యార్హత, ఎంప్లాయ్‌మెంట్ సీనియారిటీ ప్రాతిపదికన ఎంపిక ఉండేది.
- 1994 తర్వాత కొంత ప్రాధాన్యం తగ్గడంతో ఎంప్లాయ్‌మెంట్ కార్డు తీసుకునేందుకు అభ్యర్థులు వెనకాడుతున్నారు.

నమోదు ఇలా..

నిరక్షరాస్యులు, ఉన్నత విద్యావంతులు కార్డు పొందవచ్చు. www.employment.telangana.gov.in అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ వస్తుంది. అన్ని వివరాలు నమోదు చేయాలి. అభ్యర్థులు కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా పొందుతారు.

ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఏ ఉద్యోగం వచ్చినా అభ్యర్థులకు తప్పకుండా ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్ అవసరం. జిల్లాలో ఇప్పటివరకు 15,307 మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రతీ ఒక్క నిరుద్యోగ యువకులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. నిరుద్యోగులకు ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాల కోసం జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నాం. నిరుద్యోగుల కోసం ఉపాధికల్పన శాఖ ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టిసారించింది. నిరుద్యోగులకు వ్యక్తిత్వ వికాసం, ఉపాధి రంగాలపై అవగాహన కల్పిస్తున్నాం.

\- ఎం. మల్లయ్య, జిల్లా ఉపాధి కల్పనాధికారి

కదంతొక్కిన లంబాడీలు

● ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే పిటీషన్‌పై ఆగ్రహం ● సుప్రీంలో పిటీషన్ వేసిన వెంకట్రావు, బాబురావుపై గరంగరం

నర్మెట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): లంబాడీ, బంజారా, సుగాలిలను బంజార తెగ నుంచి తొలగించాలని చేస్తున్న కుట్రలను తిప్పికొట్టేందుకు నేడు వరంగల్‌లో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎల్ జేఏసీ జిల్లా కన్వీనర్ బానోతు భిక్షపతి తెలిపారు. సోమవారం నర్మెటలో గిరిజన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని భద్రాచలం ఎమ్మెల్యే వెంక్రటావు, మాజీ ఎంపీ బాబురావు సుప్రీంకోర్టులో పిటీషన్ వేయడం లంబాడీల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తేజావత్ గోవర్దన్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు భూక్య జయరాం, కొర్ర రాజేందర్, ధరావత్ రాజు, జుంలాల్, జయరాం, మంగినియా, కిషన్, కొమురవెల్లి పాల్గొన్నారు.

● పాలకుర్తి(ఆంధ్రజ్యోతి): ఎస్టీ కేటగిరి నుంచి లంబాడీలను తొలగించాలని వెంకట్రావ్, బాబూరావులు సుప్రీంకోర్టులో వేసిన పిటీషన్‌ను రద్దు చేయాలని లంబాడ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర నాయకులు భూక్యా శ్రీను నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ చౌరస్తాలో సమావేశం నిర్వహించారు. 9న వరంగల్‌లో జరిగే భారీ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జైసింగ్, మహేందర్ నాయక్, వెంకట్ నాయక్, సురేష్ నాయక్, దేవేందర్, చత్రు నాయక్, అంజన్న ఉన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్(ఆంధ్రజ్యోతి): లంబాడీ, కోయ జాతుల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు చేసేవారిని ఉరికించి కొడుతామని లంబాడీల రిజర్వేషన్ పరిరక్షణ (ఎల్ఆర్‌పీ) జేఏసీ నియోజకవర్గ నాయకులు మాలోతు రమేష్‌నాయక్, భూక్య స్వామినాయక్, గుగులోతు మధు నాయక్ హెచ్చరించారు. వెంకట్రావు, బాబురావులో పిటీషన్ దాఖలు చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో చిలుపూరు, ఘన్‌పూర్ మండలాలకు చెందిన లంబాడీలు, జేఏసీ నాయకులు భారీ ర్యాలీ చేబట్టారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు భూక్య సుందర్‌నాయక్, నాగేందర్, హారం, మాలోతు శ్రీను, గోపాల్‌నాయక్, రాకేష్, సురేష్, భద్రమ్మ, సమ్మన్న, బట్టు రెడ్డి, మోహన్‌నాయక్, శ్రీను, రాజు, బాలాజీనాయక్ పాల్గొన్నారు.

● రఘునాథపల్లి(ఆంధ్రజ్యోతి): లంబాడీలపై దుష్ప్రచారాలను మానుకోవాలని లంబాడీల అఖిల పక్ష కమిటీ జిల్లా కన్వీనర్ కొర్ర రాజేందర్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలో లంబాడీల అఖిల పక్షం నాయకులు సోమవారం విలేకరుల సమావేశంలో గుగులోతు కొంరెల్లి, భిక్షపతి నాయక్ కలిసి మాట్లాడుతూ వెంకట్రావు, బాబురావు పిటీషన్ దాఖలును నిరసిస్తూ 9న వరంగల్‌లో చేపట్టే శాంతి ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో మూడు తిరుపతి, కొర్ర శంకర్,సేన్య నాయక్, మల్లేష్ పాల్గొన్నారు.



పాలకుర్తిలో చాకలి ఐలమ్మ చౌరస్తాలో ఆందోళన



నర్మెటలో మాట్లాడుతున్న భిక్షపతి



పాలకుర్తిలో ధర్నా చేస్తున్న మాల మహానాడు నాయకులు

జీవో 99ను రద్దు చేయాలని ధర్నా

పాలకుర్తి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : మాలలను ఆర్థికంగా అణిచి వేసేందుకు తీసుకువచ్చిన జీవో 99ను రద్దు చేయాలని సోమవారం పాలకుర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట మాల మహానాడు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆ సంఘం నియోజకవర్గం ఇన్‌చార్జి ఎనమాల రాకేష్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పూర్తైన తర్వాత మాలలను 26కులాల జాబితాలో ఉంచాలన్నారు. అనంతరం తహసీల్దార్ నాగేశ్వరాచారికి వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల వెంకన్న, ప్రభాకర్, రాపంల్లి శ్రీనివాస్, ప్రవీన్, నరసింహ, సునిల్, రవి, నగేష్, దినేష్ ఉన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, మెడికల్ సీట్లలో పాటు, ఉద్యోగాల్లో తీవ్ర అన్యాయం జరిగేలా విడుదల చేసిన జీవో 99ను రద్దు చేయాలని తెలంగాణ మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల భాస్కర్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి, వినతిపత్రాన్ని క్యాంపు కార్యాలయంకు అంటించారు. కార్యక్రమంలో నాయకులు గునిగంటి చంద్రశేఖర్, చెవుల రాజేష్, చింతపండు చంద్రమౌళి, రాజు, హరీష్, శ్రీకాంత్, క్రాంతిరణదేవ్, నాగరాజు, శ్రీనివాస్, చంద్రయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు

జఫర్‌గడ్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ పాలనలో పేదల బతుకులు దుర్భరంగా మారాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు ఆరోపించారు. సీపీఎం మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు తమ్మడపల్లి(జి)లో సోమవారం ప్రారంభమయ్యాయి. రాజు మాట్లాడుతూ 11ఏళ్ల బీజేపీ పాలనలో దేశం రూ.125 లక్షల కోట్లు అప్పుల పాలైందన్నారు. ధరలు పెరిగిపోవడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజల జీవనం కష్టతరంగా మారిందన్నారు. తరగతులకు ముందుకు పార్టీ జెండాను నాయకుడు రాపర్తి సోమయ్య ఆవిష్కరించారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి గుండెబోయిన రాజు, జిల్లా నేతలు చందు నాయక్, ఎండి.షబానా, మండల నాయకులు కాట సుధాకర్, వీకే.సుధాకర్, గంగరాజు, నక్క యాకయ్య, రాపర్తి రజిత, రాజు, రాయపురం భిక్షపతి, శాగ యాదగిరి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సంపత్

చిలుపూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఆ పార్టీ జనగామకు పరిశీలకుడు గాజుల సంపత్ పిలుపునిచ్చారు. సోమవారం చిలుపూర్‌లో నిర్వహించిన ప్రవాసీ యోజన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను కార్యకర్తలకు వివరించారు. బీజేపీ మండలాధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి తోకల సంపత్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాల్నె శ్రీనివాస్‌గౌడ్, ఐలోని అంజిరెడ్డి, ఎలిశాల శ్రీనివాస్, ఊరడి రాజు, రజనీకర్, గోపాల్ పాల్గొన్నారు.

ఇద్దరు ఉద్యోగులకు గాయాలు

జనగామ రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులకు గాయలైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. బచ్చన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ చుంచు శంకర్, ఆర్ఏ మునవర్‌లు బైక్‌పై ప్రతిరోజు జనగామ నుంచి కార్యాలయానికి వెళ్తుంటారు. సోమవారం కార్యాలయానికి వెళ్తుండగా పెద్దపహాడ్ శివారులో పెట్రోల్ బంకు వద్ద సిద్దిపేట వైపు వెళ్తున్న లారీ పెట్రోల్ బంక్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నింగా వెనకాల నుంచి వస్తున్న బైక్ లారీని ఢీ కొట్టడంతో డీటీ శంకర్‌కు మోకాలికి, ఆర్ఏ మునవర్‌కు తలకు గాయలైయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా జనగామ ప్రభుత్వ ఆస్పతికి తరలించారు. శంకర్‌ను హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

అప్పుతిప్పలు పెడుతున్నారు..!

(5వ పేజీ తరువాయి)

నిర్వాహకుల ఆగడాలు రోజురోజుకు శ్రుతిమించిపోతున్నాయి. అధిక వడ్డీకి అప్పులు ఇవ్వడం, సకాలంలో చెల్లించని వారిని బెదిరించడం వంటి ఘటనలు నిత్యం ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉన్నాయి. సకాలంలో తీసుకున్న అప్పు చెల్లించకపోతే వడ్డీ వ్యాపారులు నేరుగా అప్పు తీసుకున్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి నానా రభస చేస్తున్నారు. అప్పు కట్టని పరిస్థితిలో ఉంటే ఇంట్లో ఉన్న బైకులు, కార్లు సైతం లాక్కెళ్తున్న ఘటనలు కూడా అక్కడక్కడా చోటు చేసుకుంటున్నాయి. అంతేకాకుండా బలవంతంగా ఖాళీ చెక్కులు తీసుకోవడం, ఖాళీ ప్రామిసరీ నోటుపై సంతకాలు తీసుకోవడం, బలవంతంగా ప్రాపర్టీని తమ పేరు మీదకు జీపీఏ చేసుకోవడం వంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారు. ఇదే కాకుండా అప్పు ఇచ్చే ముందే అధిక వడ్డీ తీసుకోవడంతోపాటు ముందస్తుగా ఇళ్ల స్థలాలు, ఇళ్లు, వ్యవసాయ భూములను తమ పేరు మీదకు జీపీఏ చేయించుకుంటున్నారు. ఒప్పందం ప్రకారం నిర్ణీత కాలంలో అప్పు కట్టకపోతే తమ పేరు మీద ప్రాపర్టీని బదిలీ చేసుకుంటున్నారు. ఈ విషయంపై బాధితులు పెద్ద మనుషులు, పోలీసుల వద్దకు వెళ్లినా డబ్బు బలంతో వడ్డీ వ్యాపారులు పోలీసులను కూడా మేనేజ్ చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. కాగా.. జిల్లాకేంద్రంలో ఓ వడ్డీ వ్యాపారి తమను వేధిస్తున్నాడంటూ పలువురు నెహ్రూ పార్కు వద్ద ఆందోళనకు దిగారు. దీనితో పాటు అప్పు కట్టలేదంటూ తమ ఇంటి మీదకు వడ్డీ వ్యాపారి వచ్చి దాడి చేశాడంటూ మూడు నెలల క్రితం ఓ యువకుడు జనగామ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వడ్డీ వ్యాపారుల ఆగడాలను బయట పెడితే తమకు అప్పు పుట్టదేమోనన్న భయంతో బాధితులు వెనుకడుగు వేస్తున్నారు.

అనుమతులు లేకుండానే నిర్వహణ

ఫైనాన్స్ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే వడ్డీ వ్యాపారం దందా జరుగుతోంది. వడ్డీ వ్యాపారం నిర్వహించాలంటే తెలంగాణ పాన్ బ్రోకర్ యాక్ట్-22 ప్రకారం తహసీల్దార్, కలెక్టర్ ద్వారా అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఈ అనుమతుల కోసం మీసేవా ద్వారా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. పరిశీలన అనంతరం లైసెన్స్‌ను అధికారులు జారీ చేస్తారు. లైసెన్స్ జారీ అయిన తర్వాత తెలంగాణ మనీలెండర్స్ యాక్ట్‌లో సూచించిన విధంగా మాత్రమే వడ్డీని జారీ చేయాలి. కాగా, ప్రైవేటు మనీ లెండర్స్ గరిష్ఠంగా 18 శాతం(నెలకు రూ.1.5) వార్షిక వడ్డీని మాత్రమే తీసుకోవాలి. కానీ, ఇది ఎక్కడా అమలు కావడం లేదు. వ్యాపారులు ఎవరూ ఈ అనుమతులను పొందలేదు. వీరితోపాటు డైలీ ఫైనాన్స్ పేరుతో వడ్డీ వ్యాపారం నిర్వహించే వారికి సైతం ఎలాంటి అనుమతులు లేవు.

గ్రామాల్లో ఇంటింటికి బీజేపీ



బచ్చన్నపేటలో ప్రచారం చేస్తున్న నాయకులు

లింగాలఘణపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే గ్రామీణాభివృద్ధి సాధ్యమని బీజేపీ నాయకులు బొజ్జపల్లి సుభాష్ అన్నారు. సోమవారం వడ్డిచర్ల, వనపర్తి, నేలపోగుల, కొత్తపల్లి, కుందారం, చీటూరు గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటికి బీజేపీ కార్యక్రమానికి సుభాష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేంద్ర పథకాలను ఇంటింటికి వివరించారు. కార్యక్రమంలో సురేశ్‌గౌడ్, సంపత్‌యాదవ్, కేమిడి సందీప్‌కుర్మ, కార్తీక్, మల్లేశ్, ఆగర్, శివ పాల్గొన్నారు.

● బచ్చన్నపేట(ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే దేశాభివృద్ధి జరుగుతుందని బీజేవైఎం అధికారి ప్రతినిధి చింతకింది సంతోశ్ అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు బంగారు మహేశ్ అధ్యక్షతన సోమవారం మండల కేంద్రంలో కేంద్రం పథకాలను ఇంటింటికి ప్రచారం చేశారు. కార్యక్రమంలో నద్ది సోమిరెడ్డి, గద్ద రాజు, చక్రపాణి, బేజాడి సిద్దులు, చంద్రమౌళి పాల్గొన్నారు.

● జఫర్‌గడ్(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నగేశ్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల తహసీల్దార్ రాజేశ్‌రెడ్డికి నేతలు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు గోదారి సాయిరాం, మండల ఉపాధ్యక్షులు సింగారపు రమేశ్, స్థానిక సంస్థల పార్టీ మండల కన్వీనర్ మారపల్లి రవి, మన్ కీ బాత్ మండల కన్వీనర్ గిరగోని యాదగిరి గౌడ్ పాల్గొన్నారు.

అక్షరాస్యత దినోత్సవ ర్యాలీ



మాన్‌సింగ్‌తండాలో నిర్వహిస్తున్న ర్యాలీ

నర్మెట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మాన్‌సింగ్‌తండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సోమవారం తండాలో అక్షరాస్యత దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రజలకు అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. హెచ్ఎం పి.దామోదర్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతీ ఒక్కరు అక్షరాస్యులుగా ఉండి జిల్లాను అగ్రభాగాన నిలపాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రావుల రామ్మోహన్ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీ పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్(ఆంధ్రజ్యోతి): శివునిపల్లి హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం పురస్కరించుకుని ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు ధరించి విద్యార్థులు అందరూ చదవాలి-అందరూ ఎదగాలి, పుస్తకాలతో దోస్తీ చేద్దాం- అభివృద్ధి సాధిద్దాం, అక్షర శక్తి- అనంత శక్తి తదితర నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం కె.రమేశ్, ప్రవీణ్‌కుమార్, శ్రీనికాంత్, లక్ష్మీ ప్రసాద్, శ్రీనాథ్, వసంతకుమారి, ఎం.యాదగిరి, కృష్ణవేణి పాల్గొన్నారు.

● జనగామ రూరల్(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉన్నతంగా రాణించవచ్చని జనగామ మండల విద్యాశాఖాధికారి శంకర్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి అనంతరం ధర్మకంచ జిల్లా పరిషత్ పఠశాలలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం కనుకయ్య, వయోజన విద్య లైజన్ అధికారి విజయ్ కుమార్ పాల్గొన్నారు.



సమావేశమైన అఖిలపక్ష నాయకులు

పోలింగ్ స్టేషన్ల డ్రాఫ్ట్‌పై సమావేశం

లింగాలఘణపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నిలకలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్ డ్రాఫ్ట్‌తో పాటుగా ఫొటో ఎలక్టోరల్ డ్రాఫ్ట్‌పై ఎంపీడీవో రఘురామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. 6న మండల పరిషత్ కార్యాలయం నోటీస్ బోర్డుపై ఏర్పాటు చేసిన ఫొటో ఎలక్టోరల్ ముసాయిదా, పోలింగ్ స్టేషన్ ముసాయిదాపై అభ్యంతరాల కోసం సమావేశం ఏర్పాటు చేయగా రాజకీయ పార్టీల నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదని అధికారులు తెలిపారు.

మురుగు కాల్వ సమస్యను పరిష్కరిస్తాం



బాలాజీనగర్‌లో మురుగు కాల్వను పరిశీలిస్తున్న కమిషనర్ మహేశ్వర్

జనగామ రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మురుగు కాల్వ సమస్యను పరి ష్కరిస్తామని జనగా మ మునిసి పల్ కమి షనర్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. జనగామ మూడో వార్డు బాలాజీనగర్‌లోని కెనరా బ్యాంకు పక్క వీధిలో అధ్వానంగా మారిన మురుగు కాల్వను సోమవారం పరిశీలించారు. డ్రైనేజీలో చెత్తా చెదారంతో నిండి మురుగు నీరు వెళ్లకపోవడంతో దుర్వాసన వస్తోందని, కాలనీవాసులు కమిషనర్‌కు విన్నవించారు. కమిషనర్ మాట్లాడుతూ తాతాలిక్కంగా మురుగు నీరు పోయేలా చర్యలు తీసుకుంటామని, త్వరలో డ్రైనేజీ నిర్మాణం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇప్పగూడెంలో 11, 12 వార్డులలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు సోమవారం గ్రామ కార్యదర్శి నరేష్‌కు వినతిపత్రం అందించారు. సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్ మాట్లాడుతూ ఆ రెండు వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, వీధుల్లో ముళ్లపొదలు పెరిగాయన్నారు. కార్యక్రమంలో నాయకులు కొడెపాక యాకయ్య, కుర్ర ఉప్పలయ్య, మంద మహేందర్, కిష్టయ్య, ధైద కుమార్, రామిరెడ్డి, సుజ్ఞాన్, రేణుక, రజిత తదితరులు పాల్గొన్నారు.

10న ఓటర్ల తుది జాబితా

రఘునాథపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి తుది ఓటర్లు, పోలింగ్ కేంద్రాల తుది జాబితాను 10న విడుదల చేస్తారని మండల పరిషత్ అభివృద్ధి అధికారి గార్లపాటి శ్రీనివాసులు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాలపై ఏమేనా అభ్యంతరాలు ఉంటే 9న పరిష్కరించి, 10న తుది ఓటరు జాబితాలను మండల పరిషత్ కార్యాలయంలో ప్రదర్శిస్తామని తెలిపారు. సమావేశంలో సూపరింటెండెంట్ రమేష్, కాంగ్రెస్ ప్రతినిధులు మేకల నరేందర్, గుగులోతు కొంరెల్లి, టీడీపీ మండల అధ్యక్షుడు బొక్క రాంచంద్రయ్య, సీపీఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ పాల్గొన్నారు.

సర్వేయర్లకు మరోసారి అవకాశం

జనగామ రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): శిక్షణ పూర్తి చేసుకున్న సర్వేయర్లకు మరోసారి పరీక్షకు అవకాశం కల్పిస్తున్నట్లు సర్వే, ల్యాండ్ రికార్డ్స్ సహాయసంచాలకులు మన్యంకొండ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేయర్ పరీక్షలో పాల్గొనే అభ్యర్థులు సప్లమెంటరీ పరీక్ష కొరకు 10వ తేది వరకు మీసేవలో రూ. 500 చలానా చెల్లించాలని తెలిపారు.

పథకాలను ప్రజలకు తెలియజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

రఘునాథపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలిసేలా సోషల్ మీడియా వారియర్స్ పని చేయాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన సోషల్ మీడియా వారియర్స్ సమావేశంలో రాంబాబు మాట్లాడారు. ఏదునూరి భరత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, మాజీ జడ్పీటీసీ బొల్లం అజయ్ మణికంఠ, అయితా జయరాములు, మేకల నరేందర్, తాటికొండ వెంకటేష్ యాదవ్, ఇబ్రహీం పాష, యువరాజ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తమవ్వాలి

కొడకండ్ల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో విద్యార్థులను అప్రమత్తంగా ఉంచాలని కొడకండ్ల పీహెచ్‌సీ డాక్టర్ హరికృష్ణ సూచించారు. మొండ్రాయి మహత్మ జ్యోతిరావు పూలే పాఠశాలను సోమవారం పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను హెచ్ఎం స్నేహలతను అడిగి తెలుసుకున్నారు.



ఉత్తమ టీచర్లను సన్మానిస్తున్న ఎంఈవో, కాంప్లెక్స్ హెచ్ఎంలు

కృత్యాధార బోధనతోనే ప్రగతి

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు పీరియడ్ ప్లాన్, డైరీ, కృత్యాల ఆధారంగా ప్రణాళికాబద్ధంగా బోధన చేయడంతో విద్యార్థులు విద్యాపరంగా ఎంతో ప్రగతి సాధించే అవకాశం ఉంటుందని ఎంఈవో జి.కొమురయ్య అన్నారు. సోమవారం స్టేషన్ ఘన్‌పూర్ హైస్కూల్‌లో పీఎస్, యూపీఎస్ టీచర్లకు మండల స్థాయి కృత్య మేళా నిర్వహించారు. కృత్య మేళాలో విజేతలుగా నిలిచిన టీచర్లకు ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు.

మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు

స్టేషన్ ఘన్‌పూర్ మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి సోమవారం ఎంఆర్‌సీలో ఎంఈవో ఆధ్వర్యంలో సన్మానించారు. మీదికొండ జీహెచ్ఎం శోభారాణి, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు వై.శ్రీనివాస్(సముద్రాల), బి.సోమనారాయణ(చాగల్లు), స్కూల్ అసిస్టెంట్లు టి.మంజుల(ఘన్‌పూర్), జె.రమణారెడ్డి(పాంనూర్), పి.కృపమ్మ(తాటికొండ), ఎం.వసంతకుమారి (శివునిపల్లి), ఎస్‌జీటీలు ఇ.జయమ్మ(ఘన్‌పూర్), ఎం.దేవేందర్ రెడ్డి(తానేదార్‌పల్లి), ఆర్.రేణుకాదేవి(బోయినిగూడెం), రజియా(ఇప్పగూడెం), పి.కాత్యాయని (తాటికొండ), ఖాదర్ పాష(చాగల్లు) అవార్డులు అందుకున్నారు.

ఘనంగా మదర్ మేరీ జన్మదినోత్సవం



విద్యార్థులతో ఫాదర్ దిలీప్ కుమార్

దేవరుప్పుల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలయేసు ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మదర్ మేరీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఫాదర్ దిలీప్ కుమార్ హాజరై విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి ప్రార్థనలు చేశారు. అనంతరం మేరీ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జిసురాజ్, ఉపాధ్యాయులు మహేశ్, మదన్మోహన్, కృష్ణ, అనిత, మాధవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఇళ్లకు కరెంట్ ఇవ్వాలని నిరసన



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

లింగాలఘణపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కళ్లెంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లల్లో నివాసముంటున్న పేదలకు విద్యుత్ సరఫరాను తొలగించడాన్ని నిరసిస్తూ సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. మూడేళ్లక్రితం అప్పటి కాంట్రాక్టర్ వినియోగించిన విద్యుత్‌కు నిరుపేదల చేత రూ.82వేలు కట్టించుకుని అధికారులు కనెక్షన్‌ను కట్ చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల శాఖ కార్యదర్శి బొడ్డు కరుణాకర్, తూటి దేవదానం, మబ్బు ఉప్పలయ్య, చెన్నూరు ఉప్పలయ్య, అతియాసుల్తానా, టి.లావణ్య, ఉమేశ్ జహంగీర్, రేణుక, బాబు, శోభ, ఐలమ్మ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఎన్నిక

రఘునాథపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం మండల కమిటీని మండల కేంద్రంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గుండ వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.మల్లయ్య, ఉపాధ్యక్షులుగా ఎం.యాదగిరి, ఎండి.అఫ్జల్, ఎం.కిష్టయ్య, కార్యదర్శిగా తాళ్లపల్లి సరసాని, సహాయ కార్యదర్శులుగా ఎం.యాదయ్య, యాదగిరి, ఎస్.యాదయ్య, కోశాధికారిగా మరికల చంద్రా రెడ్డి, సహాయ కోశాధికారిగా గూడ వెంకటనారాయణ ఎన్నికయ్యారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



రసూల్ బీ మృతదేహానికి నివాళులర్పిస్తున్న రాజయ్య

చిలుపూర్/జఫర్‌గడ్/స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి):వివిధ గ్రామాల్లో మృతిచెందిన వారికి నివాళులర్పిస్తూ, ఇటీవల మృతిచెందిన బాధిత కుటుంబాలను సోమవారం మాజీ ఎమ్మెల్యే టి.రాజయ్య పరామర్శించారు. చిలుపూర్‌లో అనారోగ్యం కారణంగా మృతిచెందిన ఎమ్డీ రసూల్ బీ(78) మృతదేహానికి, జఫర్‌గడ్ మండలం కూనూరులో అనారోగ్యంతో మృతి చెందిన దాట్ల అయాన్ (10) మృతదేహానికి నివాళులర్పించారు. అలాగే, స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన ఎంపీటీసీల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు గన్ను నర్సింహులు తల్లి గన్ను జయమ్మ (84) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా రాజయ్య ఆ కుటుంబాన్ని పరామర్శించారు. మీదికొండకు మాజీ రైతు కో ఆర్డినేటర్ ఇనుగాల రంగారెడ్డి (62) అనారోగ్యంతో మృతి చెందగా, మృతదేహానికి నివాళులర్పించారు.

బాధ్యతగా పనిచేస్తే గుర్తింపు

జఫర్‌గడ్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేసే ఉపాధ్యాయులకు గుర్తింపు ఉంటుందని జఫర్‌గడ్ జడ్పీ హైస్కూల్ హెచ్ఎం జి.పద్మ అన్నారు. పల్లగుట్ట హెచ్ఎంగా పదోన్నతిపై వెళ్తున్న జఫర్‌గడ్ హైస్కూల్ ఉపాధ్యాయుడు ఎల్లంబట్ల విజయ్‌కుమార్‌ను సోమవారం హైస్కూల్‌లో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.